

మాట్లాడుతున్న హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనుముల జగన్

రాజకీయాలకు అతీతంగా మున్నూరు కాపులు ఏకం కావాలి

- రాష్ట్ర హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనుముల జగన్

బర్కత్‌పుర, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపులు రాజకీయాలకు అతీతంగా ఏకమై ఒకే సంఘంగా ఏర్పడాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనుముల జగన్ పిలుపునిచ్చారు. మున్నూ రు కాపులు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించి ఆదర్శంగా నిలవాలని ఆయన కోరారు. ఆదివారం కాచిగూడలోని మున్నూరుకాపు భవన్‌లో తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అనుముల జగన్ మాట్లాడుతూ.. ఏ ఇంట్లో అయితే కేసులు ఉంటాయో ఆ ఇళ్లు బాగుపడదని, అలాగే ఏ సంఘానికి అయితే కేసులు కోర్టులో ఉంటాయో ఆ సంఘం బాగుపడదని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మున్నూరుకాపు ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మేడం వెంకట్రావు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో బండారు శ్రీధర్, వేణుగోపాల్, అమరం చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, ఎం.నర్సింగ్ రావు, సతీష్, ప్రమోద్, అశోక్, సుజాత, అన్నపూర్ణ పాల్గొన్నారు.



సమోసా పార్కును సందర్శించిన కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

సమోసా పార్కులో అన్ని సౌకర్యాలు కల్పించాలి

బర్కత్‌పుర, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్ రాహమత్ బాగ్‌లోని సమోసా పార్కును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. ఆదివారం సమోసా పార్కును పరిశీలించి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పార్కును శుభ్రంగా ఉంచాలని, ఇబ్బందికరంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని జీహెచ్ఎంసీ సిబ్బందిని ఆదేశించారు. పూలమొక్కలను అందుబాటులో ఉంచాలని, పచ్చదనం ఉట్టిపడే విధంగా పార్కును తీర్చిదిద్దాలని జీహెచ్ఎంసీ ఎస్ఎఫ్ఏలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, నాయకులు వాసు, శ్రీకాంత్, భీమ్‌రాజ్, ఆర్ సంతోష్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'దివ్యాంగుల హక్కుల సాధనకు ఉద్యమిస్తాం'

చిక్కడపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల హక్కులు, సమస్యల సాధనకోసం ఉద్యమాలు చేస్తామని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.అడివయ్య హెచ్చరించారు. చిక్కడపల్లిలోని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర కమిటీ సమావేశం అధ్యక్షుడు కె.వెంకట్ అధ్యక్షతన జరిగింది. అడివయ్య మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో దివ్యాంగులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చిన 11 ఏండ్లలో దివ్యాంగులను అన్నివిధాలుగా మోసంచేస్తున్నారన్నారు. నేషనల్ ట్రస్ట్, నేషనల్ పాలసీ 2016 చట్టాలను నిర్వీర్యం చేయడానికి కేంద్రం చేస్తున్న కుట్రలను అడ్డుకుంటామన్నారు. ఈనెల 5 నుంచి 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో సర్వేలు నిర్వహిస్తామన్నారు. రచయిత, కవి, బధిరుల ఆశాజ్యోతి హెలెన్‌కెల్లర్ జయంతి సందర్భంగా ఈనెల 27న రాష్ట్రస్థాయి సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. గౌరవాధ్యక్షుడు టి.వరమ్మ, కోశాధికారి వెంకటేష్, యశోద, ఆరిఫ్, మధుబాబు, రాజు, గంగాధర్, నగేష్, భాగ్యలక్ష్మి, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

బుల్లెట్ ప్రూఫ్ వాహనం.. 1+4 భద్రతా సిబ్బందిని వినియోగించుకోండి

- రాజాసింగ్‌కు లేఖ రాసిన మంగళ్‌హాట్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని బుల్లెట్‌ప్రూఫ్ వాహనాన్ని వినియోగించాలని, ప్రభుత్వం కల్పించిన 1+4 భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు సిటీ పోలీసులు మరోమారు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళ్‌హాట్ పోలీసులు ఆదివారం లేఖ రాశారు. మే-31న శనివారం సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు మత విద్వేశాలు రెచ్చగొట్టే అవకాశాలు ఉన్న ప్రాంతాలైన తలాబ్‌కట్ట, భవానీనగర్, ఇంజన్‌బౌలి, బాబానగర్, బహదూర్‌పురా, సంతోష్‌నగర్, యాకతుపురా, గోల్కొండ, జిర్రా ప్రాంతాల్లో రాజాసింగ్ ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోకుండా పర్యటించారు. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు ఇప్పటికే ఆయనకు వస్తున్న బెదిరింపులను, శత్రువులతో ఉన్న ప్రాణహానిని దృష్టిలో పెట్టుకొని రక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా మరోసారి విజ్ఞప్తి చేస్తూ లేఖ రాశారు.

అక్షరం సంస్థ ఆవిర్భావ పోస్టర్ ఆవిష్కరణ



అక్షరం ఆవిర్భావసభ ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ కార్యక్రమంలో అక్షరం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.ఆంజనేయులు, ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధి వెంకట్‌రెడ్డి, అమన్‌వేదిక ప్రతినిధి అంబిక, వివిధ సంస్థల ప్రతినిధులు వందన, జనార్దన్, మురళి, జయ, వరప్రసాద్, చవ్వ, రఘుపతిరావు, శివలింగం, మమత, తిరుపతి పాల్గొని అక్షరం సంస్థ ఆవిర్భావ సభపోస్టర్‌ను ఆవిష్కరించారు. - రాంనగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి)

నేడు రైతులకు విత్తనాల పంపిణీ

రాజేంద్రనగర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఈనెల 2న మధ్యాహ్నం 2:30 గంటలకు రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు ఆదివారం అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కమిషనర్, డైరెక్టర్ డాక్టర్ బి.గోపీ, వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య హాజరై రైతులకు విత్తనాలు అందజేస్తారని పేర్కొన్నారు.

విత్తన వారోత్సవాల్లో భాగంగా..

ముందుగా ప్రకటించిన మాదిరిగా, విత్తన వారోత్సవాల్లో భాగంగా జూన్ 3వ తేదీ నుంచి వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని వివిధ కేంద్రాల నుంచి రైతులకు వివిధ పంటల విత్తనాలను అందజేయడం జరుగుతోందన్నారు. వరి, కంది, మొక్కజొన్న, పెసర, మినుము, ఆముదం, చిరుధాన్యాల పంటలకు సంబంధించిన సుమారు 8,500 క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. విత్తన వారోత్సవాల్లో భాగంగా సంబంధిత కేంద్రాల నుంచి జూన్ 3వ తేదీ నుంచి కొనుగోలు చేయవచ్చన్నారు.

విత్తన విక్రయ, పంపిణీ కేంద్రాలు ఇవే..

- రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధన స్థానంలో వరి, మొక్కజొన్న విత్తనాలు అందుబాటులో ఉంటాయని, వాటికోసం 9440225385 ఫోన్ నెంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.
- రాజేంద్రనగర్‌లోని విత్తనపరిశోధన సాంకేతిక కేంద్రంలో వరివిత్తనం అందుబాటులో ఉంటోందని, 8639975840లో సంప్రదించాలన్నారు.

లంబాడీలను 'బీసీ'లో చేర్చొద్దు

సేవాలాల్ సేన రాష్ట్ర వ్యవస్థాక అధ్యక్షుడు భూక్యా సంజీవనాయక్

రాంనగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి బీసీ జాబితాలో చేర్చొద్దని, సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న కుట్రలను ఆపాలని లేనిపక్షంలో సేవాలాల్ సేన ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని సేవాలాల్ సేన వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు భూక్యా సంజీవనాయక్ హెచ్చరించారు. ఈనెల 22వ తేదీన సేవాలాల్ సేన 11వ రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సేవాలాల్‌సేన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న మ్యూజియాలలో లంబాడీల ఆనవాళ్లు లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆరోపించారు. మంత్రివర్గంలో లంబాడీలకు అవకాశం ఇవ్వకుండా అన్యాయం చేస్తోందని, లంబాడీలకు పదిశాతం రిజర్వేషన్లు సక్రమంగా అమలు చేయడంలేదని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర కన్వీనర్ మాలోతు సైదానాయక్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు కల్యాణ్ నాయక్, వ్యవస్థాపక సభ్యులు స్వరాజ్ నాయక్, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కిషన్‌నాయక్, నాయకులు రమేష్ మహారాజ్, అజయ్, వెంకన్న, రవినాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సేవాలాల్ సేన వ్యవస్థాక అధ్యక్షుడు భూక్యా సంజీవనాయక్

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కార్యక్రమాలు అభినందనీయం

చిక్కడపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఫాస్ ఫిలిం సొసైటీ, ఇట్క్లా సంస్థల ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సాంస్కృతిక, సినిమా, సాహితీ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న డా.కె.ధర్మారావు అభినందనీయుడని అన్నమాచార్య భావనావాహిని వ్యవస్థాపకురాలు, ప్రముఖ ఆధ్యాత్మిక గాయని పద్మశ్రీ డా.శోభారాజు అన్నారు.



ధర్మారావును అభినందిస్తున్న పద్మశ్రీ డా.శోభారాజు తదితరులు

ఆదివారం సాయంత్రం చిక్కడపల్లిలోని ఓ ప్రయివేట్ హోటల్‌లో ధర్మారావుసేవలను అభినందిస్తూ ధర్మారావు, సూర్యకుమారి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ డా.శోభారాజు మాట్లాడుతూ ఆరు దశాబ్దాలుగా ధర్మారావు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం పూర్వ చైర్మన్ పి.విజయబాబు, వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు, ప్రసిద్ధ మృదంగ విద్వాంసులు పద్మశ్రీ డా.యల్లా వెంకటేశ్వరరావు, రచయిత జేకే భారవి, పి.కమలాప్రసాదరావు, దక్షిణ మధ్యరైల్వే మాజీ జీఎం సి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంశీరామరాజు, ప్రముఖ దర్శకులు రేలంగి నరసింహారావును సన్మానించారు. వైవాహిక స్వర్ణోత్సవం జరుపుకుంటున్న ధర్మారావు దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, యాదగిరిగుట్ట అర్చకస్వాములు రవిచంద్రదీక్షితులు, నల్లతీగల లక్ష్మీనరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీ సంస్థ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి : బాధితులు

రాంనగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తమ ట్రేడింగ్ కంపెనీలో పెట్టుబడితే అధిక లాభాలు ఇస్తామని చెప్పి, కోట్ల రూపాయలు దండుకున్న ఎస్‌జీ ఎంటర్ ప్రైజెస్ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలుతీసుకోవాలని, ప్రభుత్వం తమకు న్యాయంచేయాలని నేషనల్ కన్స్యూమర్‌కమిషన్ డిప్యూటీ చైర్మన్ తిక్కుంట్ల విశాల్, ప్రచార కమిటీ చైర్మన్ పొట్ట పింజర రమేష్ కోరారు. ఆదివారం అడిక్‌మెట్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఇకపై యూనివర్సిటీలో పనిచేస్తున్న లక్ష్మీప్రసన్న, ఆమె సన్నిహితులు సజ్జసతీష్, వాసిరెడ్డి గౌతమి ఎస్‌జీ ఎంటర్ ప్రైజెస్‌ను ఏర్పాటుచేసి, మోసంచేశారన్నారు. మన్సూరాబాద్‌కు చెందిన సుమన్, స్వాతి భార్యాభర్తల నుంచి దాదాపు రూ.50లక్షలను ఎస్‌జీ ఎంటర్‌ప్రైజెస్‌లో డిపాజిట్ చేయించి, మోసం చేశారని ఆరోపించారు. వీరిపై చర్యలు తీసుకోవాలని బాధితులు వనస్థలిపురం పీఎస్‌లో ఫిర్యాదు చేశారని, వీరే కాకుండా అనేకమంది బాధితులు ఉన్నారని చెప్పారు. ఈ ఘటనపై నగర పోలీసు కమిషనర్‌తోపాటు డీజీపీలు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని వారు కోరారు.

'దళితుల సమస్యలపై పోరాడుతానన్న ఎమ్మెల్సీ కవితకు ధన్యవాదాలు'

చిక్కడపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): దళితుల సమస్యలపై పోరాటం చేస్తానని తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ ఎస్సీసెల్ గాంధీనగర్ డివిజన్ మాజీ ఉపాధ్యక్షుడు, చిక్కడపల్లికి చెందిన కోళ్ల సుధాకర్ ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన చిక్కడపల్లి సంజయ్‌నగర్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో తెలంగాణ జాగృతి కార్యాలయాన్ని కవితక్క ప్రారంభించడం ఆ వెంటనే దళితుల కోసం పోరాటం చేస్తాననడం మంచిపరిణామం అన్నారు. కేసీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు పాలడుగు గండయ్య, బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు ఎల్.రాజు(అడ్డగుట్ట), డీబీఆర్ మిల్ మాజీ ఉద్యోగి రవి, ముగ్గుబస్తీకి చెందిన హరి, రాజు, నగేశ్ పాల్గొన్నారు.

కార్పొరేటర్ రవిచారి పాదయాత్ర



బాగ్‌లింగంపల్లిలో సోప్ ఫ్యాక్టరీ లేన్‌లో పోచమ్మ దేవాలయం వద్ద రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి జీహెచ్ఎంసీ డీఈ గీత, ఏఈ వినోద్‌ను కోరారు. ఆదివారం సోప్ ఫ్యాక్టరీ లేన్‌లో ఆయన పాదయాత్ర నిర్వహించి, సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉపేందర్, జట్టా శ్రీనివాస్, డిచ్ శ్రీనివాస్, వీరయ్య స్థానికులు పాల్గొన్నారు. - (రాంనగర్, ఆంధ్రజ్యోతి)

టీపీఎఫ్ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర మహాసభలకు సంబంధించి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. టీపీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం, కో కన్వీనర్‌లు సంజీవరావు, రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ప్రొఫెసర్ కాసీం, ప్రొఫెసర్ గాదె ఇన్నయ్య, టీపీఎఫ్ నాయకులు అశోక్, ప్రవీణ్, సత్తయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. - రాంనగర్

వ్యాయామ ఉపాధ్యాయుడి దుర్మరణం

- పూర్వవిద్యార్థుల సమ్మేళనానికి కారులో వస్తుండగా.. • కొమురవెల్లి వద్ద రోడ్డు ప్రమాదం

కవాడిగూడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జరుగుతున్న పూర్వవిద్యార్థుల సమ్మేళనానికి వస్తున్న ఓ వ్యాయామ ఉపాధ్యాయుడు దుర్మరణం చెందాడు. కరీంనగర్ జిల్లా నుంచి కారులో వస్తుండగా..కొమురవెల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం ఆయన మృతిచెందాడు. దోమలగూడలోని ప్రభుత్వ వ్యాయామ విద్యాకళాశాల(1991) పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం దోమలగూడ కళాశాల ఆవరణలో జరిగింది. ఈ సమ్మేళనానికి టీజీ, ఏపీ రాష్ట్రాల నుంచి 70మందికి పైగా వ్యాయామ పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఇందులో పాల్గొనేందుకు కరీంనగర్ జిల్లా పెద్దపల్లికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు కడారి రవికుమార్(57) వస్తున్నాడు. సిద్దిపేట సమీపంలోని కొమురవెల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. తమతో పాటు చదువుకున్న పూర్వవిద్యార్థి మృతిచెందాడన్న వార్త వ్యాయామ ఉపాధ్యాయులను తీవ్ర విషాదానికి గురిచేసింది. దీంతో ఆత్మీయ సమ్మేళనాన్ని రద్దుచేసుకుని, రవికుమార్ సంతాప సభను నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శిగా రవికుమార్ వ్యవహరిస్తున్నాడు. కరీంనగర్ జిల్లా వ్యాయామ విద్యా ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడిగా, జిల్లా క్రీడల సమాఖ్య నిర్వహణ కార్యదర్శిగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. రవికుమార్ ఆకస్మిక మృతిపట్ల తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కోశాధికారి, ఓయూ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర జూనియర్ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.లక్ష్మయ్య, రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సోమన్న, ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎ.బాలరాజు, ఉపాధ్యక్షుడు డాక్టర్ జగన్మోహన్ సంతాపం వ్యక్తం చేశారు.



రవికుమార్(ఫైల్)

చదువులో రాణిస్తున్న విద్యార్థులను ప్రోత్సహించాలి

కవాడిగూడ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): చదువులో రాణిస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సికింద్రాబాద్ ఆర్డీఓ పి.సాయిరాం, గాంధీనగర్ సబ్‌డివిజన్ ఏసీపీ ఎ.యాదగిరి, ఎస్సీ అభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ రమేష్ సూచించారు. ప్రభుత్వ బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం పథకంలో వివిధ ప్రభుత్వ పాఠశాల్లో చదివి, పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఎస్సీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ హైదారబాద్ జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సికింద్రాబాద్ ఆర్డీఓ పి.సాయిరాం, గాంధీనగర్ సబ్‌డివిజన్ ఏసీపీ ఎ.యాదగిరి, ఎస్సీ అభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ రమేష్, ఎస్సీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు డి.సుదర్శన్ బాబు హాజరై విద్యార్థులను శాలువా, మొమెంటోతో సన్మానించారు. ముందుగా అంబేడ్కర్, బాబుజగ్జీవన్‌రాం విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ఎస్సీ ఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డి.సుదర్శన్‌బాబు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం జాతీయ అధ్యక్షులు రాగాల నాగేశ్వర్‌రావు, జాతీయ ముఖ్య ప్రధానకార్యదర్శి ఎస్.నర్సింహరావు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ రుద్రారం శంకర్, కె.గణేష్, బూపాల్‌రావు, కోశాధికారి ఈ.సత్యనారాయణ, నగర అధ్యక్షుడు గుంటి విజయ్‌బాబు, మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు కృష్ణవేణి, స్టాలిన్, కుర్మమహేందర్, దాసరి యాదగిరి, అశోక్, మల్లేషం, గోవర్ధన్, మల్లేష్, మహేష్, లింగం, సుదర్శన్, రమేష్, బాలమణి తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్, బాబుజగ్జీవన్‌రామ్‌కు నివాళులు అర్పిస్తున్న అతిథులు సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, ఏసీపీ యాదగిరి, సంస్థ డిప్యూటీ డైరెక్టర్ రమేష్ తదితరులు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: వక్తలు

రాంనగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అస్తిత్వంపై జరుగుతున్న దాడులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీనియర్ జర్నలిస్టు పరంకుశం వేణుగోపాల స్వామి పేర్కొన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ రాష్ట్రం - వర్తమాన పరిస్థితులు అనే అంశంపై వికాస సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎర్రోజు శ్రీనివాస్ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన వేణుగోపాల స్వామి మాట్లాడుతూ, తెలంగాణ నీటి హక్కులను కాలరాసే విధంగా ఏపీ సీఎం వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణకు న్యాయంగా రావల్సిన నీటిని వినియోగించుకోవడానికి పాలకులు కృషి చేయాలని సూచించారు. మాజీ వైస్ చాన్స్‌లర్, ప్రొఫెసర్ సీతారామారావు మాట్లాడుతూ, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్ని వర్గాల్లో అసంతృప్తి ఉందన్నారు. ఈ సమావేశంలో వికాస సమితి హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు రాజమహేందర్‌రెడ్డి, సభ్యులు రూబి, వెంకన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ వీసీ సీతారామారావు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ముషీరాబాద్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానించిన పూర్వ విద్యార్థులు కిరణ్, జంగయ్య, రాజు తదితరులు

ముషీరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2009-2010వ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 15 ఏళ్ల అనంతరం విద్యార్థులు ఒకేచోట కలుసుకుని యోగక్షేమాలు, ఆనాటి గుర్తులు జ్ఞాపకం చేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు భ్రమరాంబ, పరిమళ, శ్రీనివాస్, అరుణ, శైలజ, సిద్ధేశ్వర్, శ్రీరాజ పద్మ, హేమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు రమేష్, శ్రీలత, హేమలత, మౌనిక, మేరీ, సుమలత, పుష్పలత, రజని, రాధిక తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ ఫీజులు పెంచకుండా చర్యలు తీసుకోవాలి

- తెలంగాణ స్టూడెంట్స్, పేరెంట్స్ అఫిలేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్

ముషీరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు అధిక ఫీజులు పెంచకుండా ప్రభుత్వం దృష్టిసారించాలని తెలంగాణ స్టూడెంట్స్, పేరెంట్స్ అఫిలేషన్ (టీఎస్‌పీఏ) రాష్ట్ర అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్ అన్నారు. శనివారం గాంధీనగర్‌లో టీఎస్‌పీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... విద్యాశాఖ నిబంధనల ప్రకారం 10శాతం లోపే ఫీజులు పెంచాలని చట్టాలు ఉన్నప్పటికీ అందుకు విరుద్ధంగా స్కూల్ యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతూ విద్యార్థుల తల్లిదండ్రులపై పెనుభారం మోపుతున్నాయని ఆరోపించారు. స్కూల్ బుక్స్, యూనిఫాం, స్టేషనరీ స్కూల్‌లోనే కొనాలని నిబంధనలు పెడుతూ వేల రూపాయలు దండుకుంటున్నారని ఇలాంటి స్కూల్ యాజయాన్యాలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు, ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులపై స్కూల్ యాజమాన్యాలు బుక్స్, యూనిఫాం, అధిక ఫీజులు వసూలుపై ఒత్తిడి తీసుకొస్తే టీఎస్‌పీఏ చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో టీఎస్‌పీఏ నాయకులు శ్రీకాంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

బధిరుల క్రికెట్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

- రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా చిరంజీవి, ప్రసాద్



మాట్లాడుతున్న దివ్యాంగుల రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ నాయకులు వల్లభనేని ప్రసాద్ తదితరులు

రాంనగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర బధిరుల క్రికెట్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ సమావేశం క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి బధిరులు పాల్గొని కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా టి.చిరంజీవి, వల్లభనేని ప్రసాద్, ఉపాధ్యక్షుడు వి.జయప్రసాద్, సంయుక్త కార్యదర్శి షకీల్‌ఖాన్, కార్యదరుల్శుగా వెంకటేష్‌గౌడ్, నేషనల్ ఇనిస్టిట్యూట్ హియరింగ్ అధినేత చంద్రశేఖర్, కోశాధికారిగా ఇమ్రాన్‌తోపాటు ఏడుమంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో బధిరుల క్రికెట్ పోటీలను నిర్వహిస్తామన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీచేస్తున్న ఎస్‌బీఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శులు సూర్యం, భార్గవకుమార్

రాంనగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వేల్ఫేర్ అసోసియేషన్ పనిచేస్తుందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు డి.సూర్యం బార్గవకుమార్ తెలిపారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్‌లో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ స్ఫూర్తితో ఆయన ఆశయాల సాధన కోసం తమ సంస్థ పనిచేస్తుందన్నారు. ప్రతి మూడు సంవత్సరాలకోసారి తమ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. అసోసియేషన్‌లో 3,800మంది ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. వారికి యాజమాన్యం నుంచి రావాల్సిన బెనిఫిట్స్, ప్రమోషన్ల ఇతరత్రా సమస్యల కోసం తమ అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ సర్కిల్ డీజీఎం సీడీఓ పంకజ్ ప్రియదర్శి, బ్యాంకు అధికారులు రాజేష్‌కుమార్, సహదేవన్, రాధాకృష్ణ, యూనియన్ జాతీయ నాయకులు కేఎల్.చవాన్, ఎల్.చంద్రశేఖర్, నాయకులు జితేందర్‌కుమార్ పాల్గొన్నారు.